# నిద్రావస్థలో నిఘా నేత్రాలు


మేడిపల్లి ఉన్నత పాఠశాల వద్ద..

- కొన్నేళ్లుగా నిరుపయోగం.. రిపేర్‌కు నోచుకోని వైనం
- మండలంలో కొనసాగుతున్న వరుస దొంగతనాలు
- పోలీసులకు సవాలుగా మారిన కేసుల ఛేదన

యాచారం మండలంలో మేడిపల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తులేఖుర్దు, మంథన్‌గౌరెల్లి, నల్లవెల్లి, కుర్మిద్ద, యాచారం, గున్‌గల్, గడ్డమల్లాయగూడ, నందివనపర్తి తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడంలో చూపించిన చొరవ, ఆర్భాటం.. వాటి నిర్వహణలో చూపించలేకపోయారు. దీంతో అవి క్రమక్రమంగా నిరుపయోగంగా, అలంకారప్రాయంగా మారాయి. కొన్ని కెమెరాలు ఆకాశానికి, నేలకు చూడగా, మరికొన్ని కెమెరాలు తుప్పబట్టి పోయాయి. ఇంకొన్ని ఏకంగా కనుమరుగయ్యాయి. కెమెరాలకు చెందిన సెటప్ బాక్సులు పిట్టగూళ్లకు నిలయంగా మారాయి. అయినప్పటికీ వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు పట్టపగలే రెచ్చిపోతున్నారు. మండలంలో పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి, ఉపయోగంలోకి తీసుకొచ్చి చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, అసాంఘిక శక్తుల ఆగడాలు, యాక్సిడెంట్లు తదితర నేరాలను నియంత్రించేందుకు పోలీసులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**- యాచారం, జూలై 21**

మండలంలో ఇటీవలి కాలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయింది. ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేస్తూ పుస్తెల తాడులను ఎత్తుకెళ్తున్నారు. ఇండ్లల్లో దొంగతనాలతో పాటు ఇంటి ముందున్న ద్విచక్ర వాహనాలు, బోరుబావుల వద్ద ఉన్న విద్యుత్ వైర్లు, పొలాల వద్ద ఉన్న గంధపు చెట్లు, ఆఖరికి ఆలయాల వద్ద ఉన్న గుడి గంటలను సైతం దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీనికి తోడు గుర్తుతెలియని వాహనాలకు సంబంధించిన రోడ్డు ప్రమాదాలు సైతం మిస్టరీగా మారుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్నవి పనిచేయపోవడమేనని ప్రజలు అంటున్నారు. సీసీ కెమెరాలుంటే దొంగతనాలను ఛేదించడం పోలీసులకు సులభతరమవుతుందని పేర్కొంటున్నారు.

### 170 కెమెరాలు ఏర్పాటు


నక్కర్త ఎస్సీ కమ్యూనిటీహాల్ వద్ద..

పోలీసుల ప్రోద్బలంతో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో మండలంలోని 24 గ్రామపంచాయతీలకు గాను 9 గ్రామపంచాయతీల్లో 170 సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో గడ్డమల్లాయగూడలో 18, గున్‌గల్‌లో 30, చింతపట్లలో 24, మేడిపల్లిలో 30, మాల్‌లో 30, నక్కగుట్టతండాలో 8, తక్కళ్లపల్లిలో 8, కొత్తపల్లిలో 8 సీసీ కెమెరాలు అప్పటి రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ సమక్షంలో ఏర్పాటు చేశారు. రెండో దఫా కింద నందివనపర్తిలో 30, మంథన్‌గౌరెల్లిలో 30, నల్లవెల్లిలో 24 కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో యాచారం, నందివనపర్తి, తక్కళ్లపల్లితండా, గున్‌గల్, మాల్ గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఒక్కటి కూడా పనిచేయకపోవడం గమనార్హం.

### నేరాలపై నిఘా నేత్రం కరువు

ముఖ్యంగా బస్టాండ్, చౌరస్తాలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, అంగడి రోజుల్లో సీసీ కెమెరాలు సత్ఫలితాలనిస్తాయని ప్రజలు అంటున్నారు. దొంగతనాలు, పలు రకాల నేరాలను అదుపులోకి తీసుకురావడంతో పాటు అనుమానితులను గుర్తించవచ్చన్నారు. పలు నేరాలకు పాల్పడుతున్న అపరిచితులను, వారి వివరాలను సీసీ ఫుటేజీల ద్వారా పోలీసులు ఇట్టే తెలుసుకోవచ్చంటున్నారు. కానీ మండలంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పరిస్థితులు తలకిందులవుతున్నాయని వాపోతున్నారు.


మేడిపల్లి కూరగాయల మార్కెట్ వద్ద..

### శాంతి భద్రతల పరిరక్షణలో కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలు శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రధాన పాత్రను పోషిస్తాయి. కొన్ని రకాల కేసుల్లో సీసీ కెమెరాలే ప్రధాన సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి. దీంతోనే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సీసీ కెమెరాల ఆధారంగా ఇప్పటికే పలు దొంగతనాల కేసులను తక్కువ సమయంలోనే ఛేదించారు. మండలంలో ఉపయోగంలోలేని సీసీ కెమెరాలను పోలీసులు తిరిగి ఉపయోగంలోకి తీసుకురావాలి. **- మహ్మద్ గౌస్, యాచారం**

### సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి



గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. చౌరస్తాలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బస్టాండ్, సమస్యాత్మక, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. వ్యక్తిగతంగా ఇండ్ల వద్ద కూడా సీసీలను బిగించుకోవాలి. గ్రామాల్లో నూతనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకురావాలి. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉండేలా మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి. సీసీల నిర్వహణ కోసం అన్ని విధాలుగా కృషి చేస్తా. **- నరసింహారావు, సీఐ, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ**

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసర సమయంలో డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం నం.87126 70056ను సంప్రదించాలి
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, జూలై 21 : జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవద్దని.. చిన్నపిల్లలను వాటి నుంచి దూరంగా ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పంట పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చాలా సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్న పాడుబడ్డ ఇండ్లల్లో ఉండకూడదని, వర్షానికి గోడలు నాని కూలి, ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. పాడుబడ్డ బావులు, చుట్టూ కంచె లేని బావుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే వాగులు వంతెనలు దాటాల్సి ఉంటుందని, ప్రజలు వరద ఉధృతిని గమనించి దాటాలని సూచించారు. దాటేందుకు అవకాశం లేనిచో పోలీసు అధికారులకు గాని, ఇతర అధికారులకుగాని సమాచారం అందించాలని.. వీలైతే వాగుకు ఇరువైపులా రహదారిపై కంచె వేసి తోటి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎక్కడైనా రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినా పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులకు తెలుపాలని కోరారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులున్నట్లయితే ప్రజలు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ అధికారులకుగాని, డయల్ 100కు గాని, జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నం.8712670056కు గాని, సంబంధిత అధికారులకుగాని ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ, జిల్లా ప్రజల సంక్షేమంలో కూడా పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని ఎస్పీ వివరించారు.

## రాష్ట్ర ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా రాంబల్‌నాయక్



షాద్‌నగర్‌టౌన్, జూలై 21 : తెలంగాణ రాష్ట్ర లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్ ఆదివారం ఎన్నికయ్యారు. పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య 19 మందితో కూడిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించినట్లు రాంబల్‌నాయక్ తెలిపారు. రానున్న రోజుల్లో గిరిజన హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకుసాగుతామన్నారు. రాంబల్‌నాయక్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై గిరిజన నాయకులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## మానవ హక్కుల పరిరక్షణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి

పరిగి, జూలై 21 : మానవ హక్కుల పరిరక్షణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పనిచేస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి పేర్కొన్నారు. ఆదివారం పరిగిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో మాతృభూమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణిమ మహోత్సవంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఏదైనా అంశంపై ప్రభుత్వ శాఖలు స్పందించనప్పుడు ఎన్‌హెచ్‌ఆర్‌సీని సంప్రదించాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ మానవ హక్కులను వీక్షిస్తుందని తెలిపారు. బాధితుల కోసం మానవ హక్కుల కమిషన్ పనిచేస్తుందని చెప్పారు. ఎన్జీవోలతో కలిసి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా మానవ హక్కుల కమిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మానవ హక్కులకు భంగం వాటిల్లినపుడు ఎన్‌హెచ్‌ఆర్‌సీ బాధితులకు అండగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతకుముందు విజయభారతి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ నాయకులు ప్రహ్లాదరావు, లక్ష్మీకాంత్ రెడ్డి, రచయిత భాస్కరయోగి పాల్గొన్నారు.


పరిగి : బోనాలతో భక్తులు


పరిగిలో బోనాల ఊరేగింపు


పరిగి : మైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్

# బోనం.. ఘనం

- వర్షాన్ని లెక్కచేయకుండా బోనాల సమర్పణ
- వినూత్న ప్రదర్శనలతో బోనాల ఊరేగింపు

పరిగి, జూలై 21 : పరిగిలో ఆదివారం మైసమ్మ బోనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వీధులగుండా బోనాల ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపునకు ముందు భాగంలో మత్స్యకారులు వలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు సైతం బోనాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపు అనంతరం ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేసి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో మహంకాళి బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్దఎత్తున హాజరై బోనాలు సమర్పించారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఘట్టాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వలలతో విన్యాసాలు చేస్తూ బోనాలను సమర్పించారు.


ఇబ్రహీంపట్నం : వలలతో వినూత్న రీతిలో బోనం సమర్పించేందుకు వస్తున్న గంగపుత్రులు


ఇబ్రహీంపట్నం : వానలోనూ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న మహిళలు


ఇబ్రహీంపట్నం : బోనాలతో మహిళలు


తుక్కుగూడలో వర్షంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు




## వర్షం.. అన్నదాతల హర్షం

వికారాబాద్, జూలై 21 : వికారాబాద్ జిల్లాలో కొన్ని రోజులుగా ముసురుతో కూడిన వర్షాలు పడుతున్నాయి. కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయయ్యాయి. పంటలకు సరిపడా వర్షాలు కురువడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరాయంగా కురుస్తున్న వర్షంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి, మండల కేంద్రాలకు వచ్చిన ప్రజలు పలు ఇబ్బందులుపడ్డారు. పట్టణంలోని రోడ్లపై నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

### జిల్లాలో వర్షపాతం వివరాలు

| మండలం | వర్షపాతం (మి.మీ) |
|---|---|
| మర్పల్లి | 9.3 |
| మోమిన్‌పేట | 9.1 |
| నవాబుపేట | 6.3 |
| వికారాబాద్ | 8.4 |
| పూడూరు | 10.6 |
| పరిగి | 12.3 |
| కులకచర్ల | 12.5 |
| దోమ | 11.2 |
| బొంరాస్‌పేట | 10.3 |
| ధారూరు | 10 |
| కోట్‌పల్లి | 9.5 |
| బంట్వారం | 9.3 |
| పెద్దేముల్ | 8.9 |
| తాండూరు | 11.4 |
| బషీరాబాద్ | 10.9 |
| యాలాల | 10.1 |
| కొడంగల్ | 9.8 |
| దౌల్తాబాద్ | 7.8 |
| చౌడాపూర్ | 4.7 |
| దుద్యాల | 9.4 |


తుక్కుగూడలో కురుస్తున్న వర్షం


స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

## అనంతగిరిలో పెరుగు బసంతం

### భారీగా తరలివచ్చిన భక్తులు

వికారాబాద్, జూలై 21 : వికారాబాద్ అనంతపద్మనాభస్వామి చిన్న జాతర ఉత్సవాలు ఈ నెల 16 నుంచి ప్రారంభమై ఆదివారం పెరుగు బసంతంతో ముగిశాయి. స్వామివారికి అర్చకులు ప్రత్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజించిన పెరుగు కుండను ఆలయ ధ్వజస్తంభంపైకి తీసుకెళ్లి పగులగొట్టారు. పగిలిన ముక్కలు, పెరుగును ప్రసాదంగా తీసుకొని పొలాల్లో చల్లుకుంటే పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. అనంతరం స్వామివారి పల్లకీని భక్తులు ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్, సిబ్బంది శాంత్‌కుమార్ ఉన్నారు.


ఆలయ ధ్వజస్తంభంపై ఉట్టి పగులగొడుతున్న అర్చకులు


పెరుగు బసంతానికి హాజరైన భక్తులు

## సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, జూలై 21 : నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని సూచించారు.


మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను సత్కరించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# మీర్‌పేట గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా

**అవిశ్వాసంలో నెగ్గిన మేయర్, డిప్యూటీ మేయర్లకు ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశంసలు**

బడంగ్‌పేట్, జూలై 21 : మహేశ్వరం నియోజకవర్గం పరిధి మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికార పక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో నెగ్గి మరోమారు మీర్‌పేట గడ్డ బీఆర్‌ఎస్ అడ్డ అని నిరూపించిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అవిశ్వాసంలో గెలిచి పార్టీ పేరును ఉన్నత స్థానంలో నిలిపిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను, నాయకులను శాలువాతో సన్మానించారు. ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఆమె సూచించారు.

## స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకే టీ హబ్

**ఐటీ,పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్**


ఫౌండర్స్ ల్యాబ్ మొదటి వార్షిక వేడుకల్లో పాల్గొన్న ఐటీ, పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్

సిటీబ్యూరో, జూలై 21 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు ఇంజినీరింగ్ దశ నుంచే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మీద అవగాహన పెంచుకునేలా ఫౌండర్స్ ల్యాబ్ చేస్తున్న కృషి మంచి ప్రయత్నమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ అన్నారు. ఆదివారం టీ హబ్‌లో ఫౌండర్స్ ల్యాబ్ మొదటి వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జయేశ్‌రంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి టీ హబ్ వంటి సంస్థను ప్రారంభించిందన్నారు. స్టార్టప్‌ల ఏర్పాటు తర్వాత వారు ఎదుర్కొనే ఒడిదుడుకులను నివారించడానికి ఫౌండర్స్ ల్యాబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## టీ హబ్ ఎన్‌ఈసీ ప్రతినిధుల సందర్శన

సిటీబ్యూరో, జూలై 21 (నమస్తే తెలంగాణ) : స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రముఖ టెక్నాలజీ ఎన్‌ఈసీతో కలిసి పనిచేస్తామని టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు తెలిపారు. ఎన్‌ఈసీ నెట్‌వర్క్స్ అండ్ సిస్టం ఇంటిగ్రేషన్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ టెట్‌సూ ఓకుడ టీ హబ్‌ను సందర్శించి స్టార్టప్ కార్యకలాపాలపై చర్చించారని తెలిపారు. టెక్నాలజీ స్టార్టప్ ఇంక్యుబేటర్‌గా ఉన్న టీ హబ్ సరికొత్త టెక్నాలజీలను స్టార్టప్‌లకు ఉపయోగపడేలా ఆయా పరిశ్రమలకు చెందిన నిపుణులతో ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, అదేవిధంగా జపాన్‌కు చెందిన కంపెనీ టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉందన్నారు. ఎన్‌ఈసీ అనుబంధ సంస్థగా ఉన్న ఎన్‌ఈఎస్ఐసీ సంస్థ టెలీ కమ్యూనికేషన్స్, ఐసీటీ, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌ను అందించడంతో ఎంతో అనుభవం ఉన్నదని, అలాంటి సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా స్టార్టప్‌లకు ఎంతో మద్దతు లభిస్తుందన్నారు.